క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న భువనేశ్వరరాజు

బేతంచెర్ల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో యోగా, ధ్యానంతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ మాస్టర్లు సుజన, నాయుడు, భువనేశ్వరరాజు అన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర పిరమిడ్ ధ్యాన మందిరం 12వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అసూయ రాగద్వేషాలకు దూరంగా ఉంటూ కోరికలకు కళ్లెం వేసి సమాజంలో అందరూ మనవారే అనే భావనతో జీవించాలన్నారు. కష్టాలు, సమస్యలతోనే మనిషి ఎదుగుదల సాధ్యం అవుతుందన్నారు. దుఃఖానికి కారణం అజ్ఞానం అని, ధ్యానం ద్వారా జ్ఞానం వస్తుందన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: మండల కేంద్రం అవుకులోని మార్కెట్ వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు పండ్ల వాయునందన గౌడ్ తల్లి పండ్ల లక్ష్మమ్మ (86) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజగోపాల్ గౌడ్, నాయకులు కాటసాని అంకాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రొట్టెల పంపిణీ



ఆస్పత్రిలో రొట్టెలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

డోన్: ప్రభుత్వాస్పత్రిలోని గర్భిణులు, బాలింతలు, రోగులు, వారి సహాయకులకు ఆదివారం రొట్టెలు పంపిణీ చేశారు. దాతల సహాయంతో ఈ కార్యక్రమం చేసినట్లు ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ తెలిపారు. ఇతరులకు సహాయం చేయడం వల్ల ఆత్మ సంతృప్తి కలుగుతుందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి జియారత్



మౌలాలి స్వామి

సంజామల: మండల పరిధిలోని ముచ్చలపూరి గ్రామంలో మౌలాలి స్వామి జియారత్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి నుంచి స్వామివారి ఊరేగింపు జరిగింది.

జవాన్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూ గన్ మిస్‌ఫైర్ కావడంతో మృతిచెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ వెంకటేశ్వర్లు(32) మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం జూనూతల గ్రామానికి తీసుకొచ్చారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శాకంబరీగా శ్రీమహాలక్ష్మి



బేతంచెర్ల: ఆషాఢ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు కళ్యాణ చక్రవర్తి, జ్వాలా చక్రవర్తి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. 1008 పూర్ణములతో శ్రీమహాలక్ష్మి సహస్రనామమం పఠించారు. శ్రీమహాలక్ష్మి నమోస్తుతే, జగన్మాత నమోస్తుతే అంటూ భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి మహా మంగళహారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు. శాకంబరి అలంకారం విశిష్టతను భక్తులకు వివరించారు.

వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకం

- కూలీల కొరతను అధిగమించొచ్చు
- పెట్టుబడులు ఆదా
- మంచి దిగుబడులకు ఆస్కారం
- వెదజల్లే పద్ధతి వైపు మొగ్గుచూపుతున్న రైతులు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు వరిసాగుకు సిద్ధమవుతున్నారు. అయితే సాగులో పెరిగిన ఖర్చులు, కూలీల కొరత వల్ల దమ్ము పొలంలో మొలకెత్తిన విత్తనాలు నేరుగా చల్లే పద్ధతిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పద్ధతిలో ఎకరాకు 15 నుంచి 20 కిలోల విత్తనం ఆదా అవుతుంది. పంట 7 నుంచి 10 రోజులు ముందుగా కోతకు వస్తుంది. నారు పెంపకం, నాట్లు వేసే పని ఉండదు. కాబట్టి సాగు ఖర్చు తగ్గుతుంది.



రైతులకు సలహాలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు (ఫైల్)

బనగానపల్లె: అదును సమయంలో కూలీలు దొరక్క ఇబ్బంది పడే సందర్భాల్లో ప్రత్యామ్నాయంగా వెదజల్లే పద్ధతిపై రైతులు దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా కూలీల ఖర్చు మిగలడమే కాకుండా పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సాగు విధానం

వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేసేటప్పుడు నేలను కలియదున్నాలి. నేల స్వభావాన్ని బట్టి నాలుగుమూలలు సమానంగా ఉండేలా చూసుకోవాలి. పొలాన్ని చిన్నచిన్న మడులుగా విభజించుకుంటూ చదును చేయడం వల్ల నీరు పెట్టడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. బురద పదునులో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలువలు చేయాలి. శుద్ధి చేసిన విత్తనాన్ని నేరుగా పొలంలో వెదచల్లడం లేదా డ్రమ్ సీడర్ ద్వారా విత్తుకోవాలి. విత్తనాన్ని ఎక్కువ లోతులో వేస్తే మొలకశాతం దెబ్బతినే అవకాశం ఉంది. సుమారు 2.5 నుంచి 5 సెంటీమీటర్ల లోతులో వేసుకోవాలి. తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకుని పలుమార్లు పొలాన్ని దుక్కి చేస్తే కలుపు సమస్యను కొంత వరకు అధిగమించవచ్చు. వీలైనంత వరకు నేల సమతలంగా ఉండేలా చూసుకోవాలి.

విత్తన మోతాదు

ఈ పద్ధతిలో అయితే రకాన్ని బట్టి ఎకరానికి 12 నుంచి 16 కిలోల విత్తనం, డ్రమ్ సీడర్‌లో విత్తుకుంటే 10 నుంచి 12 కిలోల విత్తనం అవసరం అవుతుంది.

ఎరువుల యాజమాన్యం

ప్రధాన పోషకాలను భూసార పరీక్షల ప్రకారం వాడాలి. సిఫార్సు చేసిన భాస్వరం ఎరువు పూర్తి మొతాదును ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. పోటాష్ ఎరువును ఆఖరి దుక్కిలో సగ భాగం, మిగిలిన సగభాగం నత్రజని ఎరువులతో పాటు అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. నత్రజని ఎరువును మూడుదఫాలుగా విత్తిన 15 రోజులకు పిలక దశలో, అంకురం దశలో వేయాలి. సాధారణంగా ఆరుతడి వరిలో ఇనుప దాతులోపం వస్తుంది. ఇనుపదాతు లోపించడం వల్ల ఆకులు తెల్లగా పాలిపోయినట్లు ఉండి ఎదుగుదల ఉండదు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే లీటర్ నీటికి 20 గ్రాముల అన్నబేరి మరియు 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

కలుపు యాజమాన్యం

ఈ పద్ధతిలో నీరు నిల్వగట్టడం ఉండదు. కాబట్టి కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. కలుపు నివారణకు ఒక ఎకరానికి లీటర్ పేండిమితాలిన్ 35 గ్రాములు ఆక్సాడయర్జిల్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 2 నుంచి 3 రోజుల్లోగా పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు కలుపు ఉధృతిని బట్టి బిస్‌పైరిబాత్ సోయిఎం మందును 80-120 మి.మీ లేదా కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు 400 గ్రాములు సోడియంస్టాల్ మందును పిచికారీ చేయాలి. పంట వరుసల్లో విత్తితే వరుసల మధ్య అంతర కృషి చేసుకోవచ్చు. దీని వల్ల తక్కువ ఖర్చుతో కలుపు నివారించుకోవచ్చు. పంటకు ప్రతి 7 నుంచి 10 రోజులకు ఒకసారి అవసరం మేరకు నీటి తడులు పెట్టాలి. ఆరుతడి వరికి పొలంలో ఎల్లప్పుడు నీరు నిల్వ ఉంచాల్సిన అవసరం లేదు. అయితే పంటకు కావాల్సిన తేమను అందించడం వల్ల పంట కీలక దశల్లో బెట్టకు గురి కాకుండా చూడవచ్చు. ఈ పద్ధతిలో నీటిని 40-50 శాతం వరకు ఆదా చేయవచ్చు.

ఆరుతడి పద్ధతి వరిసాగుతో లాభాలు

నారుమడి నాట్లకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. చెరువులు, కాలువల కింద సాగు చేసే పరిస్థితుల్లో నాట్లు అలస్యం కాకుండా సకాలంలో పంటలు సాగు చేసుకోవచ్చు. పంట వారం నుంచి 10 రోజులు ముందుగా కొతకు వస్తుంది. నీటిని ఆదా చేసుకోవచ్చు. ఆరుతడిలో సాధారణంగా వేసే మాగాణి వరి దిగుబడులతో పోల్చినప్పుడు సుమారు 80-90శాతం దిగుబడులు పొందవచ్చు.

మంచి దిగుబడులు సాధించవచ్చు



నేరుగా వరి విత్తే పద్ధతి వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకుని ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ పద్ధతి వల్ల వరి దిగుబడి కూడా పది రోజుల ముందుగా వస్తుంది. చాలా మంది రైతులు ఈ పద్ధతి ద్వారా వరి సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. చీడపీడలు తక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున పంట దిగుబడి ఆశా జనకంగా ఉంటుంది.

–సుధాకర్, కేవీకే శాస్త్రవేత్త, యాగంటిపల్లె

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

డోన్ టౌన్: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా లారీ డ్రైవర్లు, క్లీనర్లకు లారీ యజమానులు జీతభత్యాలు పెంచాలని లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శివరామ్, సీఐటీయూ నేత యల్లయ్య కోరారు. ఆదివారం లారీ డ్రైవర్లు, క్లీనర్లతో సమావేశమయ్యారు. లారీ యజమానులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ నెల23వ తేదీ నుంచి సమ్మె చేసే విషయాలపై చర్చించారు. కార్మికులు, యజమానులకు మధ్య రెండేళ్లకు ఒకసారి జరిగే వేతన సవరణ జనవరి 2024కు ముగియడంతో జీతాలు పెంచాలని కోరారు. కార్మికుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలని.. లేకుంటే 23వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గోపాల్, మద్దిలేటి, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

26న చౌడేశ్వరిదేవికి సారె సమర్పణ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారికి ఈ నెల 26న చీర, సారె సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. 26న ఉదయం 10 గంటలకు గ్రామంలోని చెన్నకేశ స్వామి ఆలయం వద్దకు భక్తులు చీర సారె తీసుకుని రావాలని అక్కడి నుంచి గ్రామోత్సవంగా చౌడేశ్వరిదేవి ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు.

రేపటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

ప్యాపిలి: మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ ప్యాపిలి-2, ఎన్ రాచర్ల, జలదుర్గం-1 సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 24వ తేదీ ప్యాపిలి-1, బోయిన్‌చెర్వుపల్లి, చంద్రపల్లి, 25న ప్యాపిలి-4, నేరేడుచెర్ల, హుసేనాపురం, 26న పోతుదొడ్డి, బూరుగల, ఊటకొండ, 27న వెంగళాంపల్లి, ఎన్ రాచర్ల, మాధవరం సచివాలయాల్లో క్యాంపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్ కార్డులు అప్డేట్, విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్ వంటి సేవలు మొబైల్ క్యాంపుల ద్వారా ప్రజలకు అందుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

అరకొర వసతులతో విద్యార్థుల అవస్థలు



పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

డోన్ టౌన్: పట్టణంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి రెండేళ్లు అవుతున్నా సరైన వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్న ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో నీటి కొరత, తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత ఉందని తెలిపారు. విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు హరినాథ్, సాయి, వినోద్ నాయక్, రాజు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్: కర్నూలులోని ఎస్ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన మొదటి ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన విద్యార్థులు పతకాలు సాధించారని రాంమ్స్ స్కూల్ ఆఫ్ కరాటే మాస్టర్ రమణ తెలిపారు. కటా విభాగంలో జైదీక్షిత్ బంగారు పతకం, భానుప్రకాష్ వెండి పతకం, చరణ్‌తేజ్, సుజిత్, అశ్వద్, అనికేత్, మనోజ్ఞలు కాంస్య పతకాలు సాధించారని వెల్లడించారు. కుమిటే విభాగంలో రాజేష్ బంగారు పతకం, అభిరామ్, మనోజ్ఞలు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విజేతలతో పాటు కరాటే మాస్టర్ రమణను నిర్వాహకులు ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకుడు శిల్పి సుబ్బరాయుడు

బనగానపల్లె: ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి వడ్డెర సొసైటీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం బనగానపల్లె మండలంలోని యనకండ్ల గ్రామంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో వడ్డెర సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలదాటినా వడ్డెర కులస్తులు, సొసైటీలకు ఇచ్చిన హామీలపై ఎలాంటి ప్రకటన చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో తమకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో ప్రస్తావన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, శివ, గంగన్న నాగరాజు, శ్రీను, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.







కోవెలకుంట్లలో సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు, సత్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం, బనగానపల్లె: బాబాను దర్శించుకుంటున్న భక్తులు



కళారత్న దత్తాత్రేయశర్మను సత్కరించిన ప్రజలు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- భక్తులకు అన్నదానం



స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



బనగానపల్లెలో సామూహిక సత్యవ్రతంలో మహిళా భక్తులు



డోన్: ప్రత్యేక పుష్పాలంకరణలో మాలిక్ బాబా సమాధి

కోవెలకుంట్ల: గురు పౌర్ణమిని పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణ శివారులోని సాయిబాబా ఆలయంలో ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి, దత్త, రుద్ర హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని సత్యనారాయణ స్వామి, సత్యసాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

బాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం, మిట్టపల్లె, ఎర్రగుడి తదితర గ్రామాల్లోని షిరిడీసాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఉన్న షిరిడీ సాయిబాబాకు ఉదయం కాగడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు, సామూహిక సాయిసత్యవ్రతాలు చేశారు. అనంతరం బాబాను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

డోన్ టౌన్/డోన్: పట్టణంలోని సాయిబాబా, దత్తాత్రేయ, మాలిక్‌బాబా సంస్థాన్ ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సాంబశివాలయంలోని సాయిబాబా విగ్రహానికి ప్రధాన అర్చకులు శేషావలి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని పాలిక వరచితంబర స్వామి సన్నిధిలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గండ్లూరి దత్తాత్రేయశర్మకు ప్రత్యేక సత్కారాలు

గురు పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని గాయత్రీ పీఠంలో శతవధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవుల్లోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన జ్యోతులు వెలిగించే వారిని సన్మార్గంలో నడిపే వారే నిజమైన గురువులని పేర్కొన్నారు.

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బాబాను దర్శించుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కృపాధామ కమిటీ సభ్యులు బాబుల్‌రెడ్డి, గుండా గోపాలు, వీరభద్రారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: గురు పౌర్ణమి సందర్భంగా షిరిడీ సాయి నామంతో ఆలయాలు మార్మోగాయి. కొలిమిగుండ్ల, యర్రగుడి, అంకిరెడ్డిపల్లెలోని సాయిబాబా ఆలయాల్లో వేడుకలు జరిగాయి. కొలిమిగుండ్లలో మైన్స్ అండ్ జియాలజీ మాజీ డైరక్టర్ వీడీ రాజగోపాల్ ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో పూజలు జరిగాయి. సాయినాథ్ మినరల్స్ ఆవరణలోని ఆలయం, యర్రగుడి గీతా మందిరంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్రగుడిలో నిర్వహించిన సాయి సత్యవ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగడ హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కొలిమిగుండ్లలో షిరిడీ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం లక్కసాగరానికి చెందిన గాయని దాసరి పార్వతి పాడిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. హైదరాబాదుకు చెందిన ప్రముఖ గాయకులు డాక్టర్ రవీంద్రబాబు, శ్రీనోరి రఘురామమూర్తి, వెంకట హేమ కళ్యాణి బృందం భక్తి గీతాంజలి పాటలు పాడారు. బాలికలకు భక్తి గీతాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మయ సభ దుర్యోధుని ఏకపాత్రాభినయం పోటీల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి కళాకారులు ప్రదర్శనలు చేశారు. రాష్ట్ర స్థాయి కళాకారులతో ప్రదర్శించిన పంచమాంకములు నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.





కొలిమిగుండ్లలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బేతంచెర్లలో..



బాబా తులాభారంలో పాల్గొంటున్న భక్తులు



సంస్థాన్‌లో భజన చేస్తున్న సత్సంగ్ సభ్యులు